'మిచాంగ్'తో రైతుల ఆందోళన

- పంట ఉత్పత్తులను ఆరబెట్టే పనిలో నిమగ్నం
- చకచకా పత్తితీతలు

నాదెండ్ల: తుఫాను కారణంగా భారీ వర్షాలు కురుస్తాయన్న సమాచారంతో రైతులు సతమతమవుతున్నారు. ప్రస్తుతం పత్తితీత పనులు ముమ్మరంగా ఉన్నందున కూలీలను ఒక్కొక్కరికి రూ.500 చొప్పున చెల్లిస్తూ ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పనిచేయిస్తున్నారు. తుఫాన్ కారణంతో తీసిన పత్తిని రైతులు విక్రయిస్తున్నారు. గణపవరంలోని సీసీఐ కేంద్రం వద్ద గ్రామాల నుంచి వచ్చిన పత్తి ట్రాక్టర్లతో క్యూ కట్టాయి. ప్రస్తుతం మార్కెట్లో ప్రైవేటు వ్యాపారులు పత్తి ధర క్వింటా రూ.6 వేలు చొప్పున కొనుగోలు చేస్తుండగా, సీసీఐ కేంద్రంలో క్వింటా రూ.7020 ఉండగా, రూ.6700–6800 వరకూ ధర దక్కుతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షం మిర్చి, పొగాకు పంటలకు కొంత మేలు చేకూర్చే అవకాశాలు ఉన్నాయి. శనగ పంటవేసిన కొద్ది రోజులకే వర్షాలు పడటంతో కొంత పంట మొలకెత్తక పోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

యడ్లపాడు: మండల పరిధిలో మిచాంగ్ తుఫాన్ ప్రభావం పెద్దగా కనిపించలేదు. సోమవారం ఉదయం నుంచే నల్లమబ్బులు దాల్చి చలిగాలుల ప్రభావం అధికంగా ఉంది. తెల్లవారుజాము నుంచే చిరుజల్లులు మొదలయ్యాయి. సాయంత్రం 5 గంటల నుంచి కొండప్రాంతాల్లోని గ్రామాల్లో ఓ మోస్తారు వాన పడింది. మధ్యాహ్నం సమయంలో పలుగ్రామాల్లో ఈదురు గాలులు వీచాయి. దీంతో సంగం గోపాలపురం వెళ్లే మార్గంలో పలుచెట్ల కొమ్మలు విరిగి రోడ్డుపై అడ్డంగా పడ్డాయి. యడ్లపాడు రూరల్ గ్రామాల్లో సాయంత్రం 3.15 నుంచి 6.30 గంటల వరకు విద్యుత్ సరఫరా లేక ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడ్డారు. ఇక పంటల విషయానికి వస్తే ప్రస్తుతం కురిసిన వానతో శనగకు ఇబ్బంది లేదని, పత్తి పంట తీతలు ఇప్పటికీ దాదాపుగా పూర్తికాగా మూడోదశ తీతలు ఆలస్యమైన చోట కొద్దిపాటి ఇబ్బందులు పడే అవకాశం ఉందని ఏఓ సీహెచ్ సరిత తెలిపారు. తుఫాన్ రీత్యా గ్రామాల్లో ఎప్పటికప్పుడు పంటల పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. తహసీల్దార్ వైవీబీ కుటుంబరావు మాట్లాడుతూ సోమవారం కురిసిన వర్షం వల్ల గ్రామాల్లో ఏమీ ఇబ్బంది లేదని, రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేశామన్నారు. అలాగే కలెక్టర్ సూచనల మేరకు అత్యవసర పరిస్థితుల సమయంలో తక్షణ సహాయం కోసం ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు.


సంగంగోపాలపురం వద్ద చెట్టుకొమ్మ విరిగి రోడ్డుపై అడ్డంగా పడిన దృశ్యం


గణపవరం సీసీఐ కేంద్రం వద్ద పట్టాలు కప్పి అమ్మకానికి ట్రాక్టర్‌లో తరలించిన పత్తి


ఒరిగి పక్కనే ఉన్న విద్యుత్ లైన్‌పై పడిన సెంట్రల్ లైటింగ్ స్తంభం

ఒరిగిన సెంట్రల్ లైటింగ్ స్తంభం: తప్పిన ప్రమాదం

నరసరావుపేట: నిత్యం రద్దీగా ఉండే స్టేషన్‌రోడ్డులో సెంట్రల్ లైటింగ్ విద్యుత్ స్తంభం సోమవారం వీచిన గాలులకు ఒరిగి పక్కనే ఉన్న విద్యుత్‌లైనుపై పడింది. అయితే వెంటనే విద్యుత్ సరఫరా ఆగిపోవటంతో పెద్దప్రమాదమే తప్పింది. తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలోని ఇండోర్ సబ్ స్టేషన్ నుంచి అరండల్‌పేటకు విద్యుత్ సరఫరా చేస్తున్న లైనుపై పడటంతో సుమారు ఒక గంటసేపు సరఫరా నిల్చిపోయింది. మున్సిపల్ సిబ్బంది ఆస్తంభాన్ని తొలగించటంతో విద్యుత్ అధికారులు సరఫరాను పునరుద్ధరించారు.

రూ.80లక్షలతో కోటప్పకొండ అభివృద్ధి పనులు

నరసరావుపేట రూరల్: భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా కోటప్పకొండపై మౌలిక వసతులు కల్పిస్తున్నట్టు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. కోటప్పకొండలో దాదాపు రూ.80లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులను సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటప్పకొండ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషిచేస్తున్నట్టు తెలిపారు. కొండపై అభివృద్ధి పనులు నిరంతరాయంగా కొనసాగుతాయన్నారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు నిత్యాన్నదానాన్ని ఆలయంలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం చిలకలూరిపేటకు చెందిన దాతలు తేళ్ల సుధీర్, శ్రీధర్ సహకారంతో నిత్యాన్నదాన మండపాన్ని అందుబాటులోకి తీసుకువచ్చినట్టు తెలిపారు. అలాగే నూతనంగా వంటశాల, వసతి గదులు, లిఫ్ట్‌తో పాటు పలు నిర్మాణాలను కొండపై చేపడుతున్నట్టు వివరించారు. మహాశివరాత్రి రోజున నిర్వహించే తిరునాళ్లకు ఆయా పనులు అందుబాటులోకి వస్తాయని వివరించారు. జెడ్పీటీసీ పదముత్తం చిట్టిబాబు, ఎంపీపీ మూరబోయిన శ్రీనివాసరావు, ఆలయ ఈఓ గొలమూరి శ్రీనివాస రెడ్డి, ఆలయ కమిటి సభ్యులు మట్లా లింగారెడ్డి, వంపుగుడి జానయ్య తదితరులు పాల్గొన్నారు.


కోటప్పకొండలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

మిర్చిలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

నాదెండ్ల: తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపధ్యంలో సోమవారం ఉద్యానవన శాఖ అధికారి కిశోర్‌కుమార్ మిర్చిపంటను పరిశీలించారు. చిరుమామిళ్ల గ్రామంలో మిర్చి పంటను పరిశీలించిన అనంతరం రైతులకు పలు సూచనలు చేశారు. యాజమాన్య పద్ధతులను వివరిస్తూ పొలాల్లో అధిక వర్షపు నీరు నిల్వ ఉంటే నేరుగా బయటకు వెళ్లబెట్టేందుకు ప్రయత్నించాలన్నారు. వర్షాలు తగ్గిన తర్వాత 19.9.19 లేదా 13.40.45 లేదా యూరియా వంటి పోషకాలను పిచికారీ చేసుకోవాలన్నారు. ఆ తర్వాత అంతరసేద్యం చేసి నేల త్వరగా ఆరేటట్లు చూసుకోవాలన్నారు. నీరు నిల్వ ఉండటం వలన ఎండు తెగులు ఆశించే అవకాశం ఉన్నందున నివారణకు కాపరాక్సి ఫ్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటిలో లేదా మెటలాక్సి ప్లస్ మాంకొజబ్ 2 గ్రాములను లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్లలో పోయాలన్నారు. బ్యాక్టీరియా, ఆకు మచ్చ వంటి తెగుళ్లు వచ్చే ప్రమాదం ఉన్నందున కాపరాక్సీ క్లోరైడ్ పిచికారీ చేసుకోవాలన్నారు.

నరసరావుపేట రూరల్: తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున మిరపలో యాజమాన్య పద్ధతులు చేపట్టాలని ఉద్యాన అధికారి డి.నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని పలు గ్రామాల్లో ఉద్యాన అధికారులు పర్యటించి రైతులు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను తెలియజేశారు. పొలంలో నిలిచిన నీటిని సాధ్యమైనంత త్వరగా బయటకు పంపే ఏర్పాటు చేయాలని తెలిపారు. వర్షాలు ఆగిన వెంటనే 19–19–19, 13–0–45, యూరియా వంటి పోషకాలను పంటపై పిచికారీ చేయాలని తెలిపారు.


మిరప రైతులతో మాట్లాడుతున్న ఉద్యాన అధికారి నవీన్‌కుమార్

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వినుకొండ (నూజెండ్ల): మిచాంగ్ తుఫాన్ నేపధ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వినుకొండ తహసీల్దార్ కిరణ్‌కుమార్ అన్నారు. తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన వీడియో సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తుఫాన్ ప్రభావంతో కార్యాలయంలో ప్రజల సౌకర్యార్థం కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మంగళవారం సాయంత్రం వరకు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రభుత్వ పాఠశాలలు, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు తెలిపారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో తప్ప బయటకు రాకూడదన్నారు. ఎక్కడైనా ఎలాంటి పరిస్థితుల్లోనైనా కంట్రోల్ రూమ్ 9849904030 నంబరును సంప్రదించాలన్నారు.

రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో సమావేశం

యడ్లపాడు: మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ వైవీబీ కుటుంబరావు సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుఫాన్ హెచ్చరికలు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌తో పాటు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పట్టాదార్ పాసుపుస్తకాలు, మ్యూటేషన్, రీసర్వే, రెవెన్యూ సంబంధిత 20 రకాల సేవలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ ఎం.చక్రవర్తి, రెవెన్యూ అధికారులు, గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

నాగసరపు రామారావుకు ఘననివాళి

నరసరావుపేట ఈస్ట్: ఆధ్యాత్మిక, విద్య, సేవారంగాల్లో నాగసరపు రామారావు సేవలు అందరికీ ఆదర్శప్రాయమని పలువురు వక్తలు కొనియాడారు. సుబ్బరాయ అండ్ నారాయణ కళాశాలలో సోమవారం కళాశాల మాజీ కార్యదర్శి నాగసరపు రామారావు 11వ సంస్మరణ సభ నిర్వహించారు. రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కళాశాల కార్యదర్శిగా 55 సంవత్సరాల పాటు సేవలు అందించి పల్నాడు ప్రాంతంలో విద్యా ప్రదాతగా రామారావు సేవలు అందించారని తెలిపారు. అలాగే పట్టాభిరామస్వామి ఆలయ ధర్మకర్తగా ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సామాజిక సేవారంగంలో గణనీయమైన సేవలు అందించారని కొనియాడారు. రామారావు అందించిన సేవలకు గుర్తుగా ఇందిరాప్రియదర్శిని అవార్డుతోపాటు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ప్రతిభా పురస్కారంతో గౌరవించారని తెలిపారు. సంస్మరణ సభకు రామారావు కుమారుడు, కళాశాల కార్యదర్శి నాగసరపు సుబ్బరాయగుప్త అధ్యక్షత వహించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు కపలవాయి విజయకుమార్, ఉపాధ్యక్షుడు పెనుగొండ వెంకటేశ్వరరావు, రామారావు మనుమలు రూపేష్ గుప్త, రాందేవ్ గుప్త, ప్రిన్సిపాల్ డాక్టర్ సోము మల్లయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


రామారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కళాశాల పాలకవర్గ ప్రతినిధులు, అధ్యాపకులు

చిరు జల్లుల వల్ల పంటలకు నష్టం లేదు

కారెంపూడి: ప్రస్తుతం పడుతున్న తేలిక పాటి జల్లుల వల్ల పంటలకు నష్టం లేదని ఇంకా బాగా పడితే పొలాలు పదును అవుతాయని మెట్ట పంటలకు మేలు జరుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి బి.యలమందారెడ్డి సోమవారం తెలిపారు. పెద్ద వర్షం పడితే పంటలకు పదును ఈ నెలాఖరు వరకు ఉంటుందని మెట్ట పంటలకు చాలా ఉపయోగమన్నారు. మండలంలో వేసిన 2,200 ఎకరాలలో వేసిన మిర్చి పంట ప్రస్తుతం పూత దశలోనే ఉందని వర్షం వల్ల మిర్చికి నష్టం జరగదన్నారు. కాయ దశలో ఉన్నా పెద్ద వర్షం అయితే కాయకుళ్లు వచ్చే అవకాశం ఉందన్నారు. ఇదిలా ఉంటే సోమవారం కారెంపూడి మండలంలో చిరు జల్లులే పడ్డాయి. వర్షం మాత్రం పెద్దగా పడలేదు. ఇప్పటికి పంటలకు నష్టం లేదని ఇంకా బాగా పడితే వర్షాధార పంటలకు మేలు జరుగుతుందని రైతులు చెబుతున్నారు.


కోత దశలో ఉన్న వరి పంట

తుదిదశకు కోల్డ్ స్టోరేజీ నిర్మాణ పనులు

- రూ.6 కోట్ల వ్యయంతో వేల్పూరులో నిర్మాణం
- త్వరలో ప్రారంభం



శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామంలో శావల్యాపురం సొసైటీ ఆధ్వర్యంలో నాబార్డు నిధులు రూ. 6కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న శీతల గిడ్డంగి భవన నిర్మాణ పనులు తుదిదశకు చేరినట్లు సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య తెలిపారు. సోమవారం స్థానిక సొసైటీ కార్యాలయంలో చైర్మన్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనలో స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో గతంలో ఎన్నడు జరగని అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. 3వేల మెట్రిక్ టన్నులు సామర్థ్యం కల్గిన శీతల గిడ్డంగి భవన నిర్మాణ పనులు తుదిదశకు చేరగా ఇప్పటికే ట్రయల్ రన్ వేశామన్నారు. వచ్చే నెలలో ప్రారంభోత్సవం చేయటానికి రంగం సిద్ధం చేశామన్నారు. కోల్డ్‌స్టోరేజ్ పరిధిలో ప్రస్తుతం లెవలింగ్ పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే రైతులు పండించిన పంటలను నిల్వ ఉంచేందుకు ప్రభుత్వపరంగా 1000 మెట్రిక్ టన్నులు రూ. 75 లక్షల వ్యయంతో చేపట్టిన గోదాము నిర్మాణ పనులు పూర్తి అయినట్లు చెప్పారు. మండలంలోని కొత్తలూరు, మతుకుమల్లి గ్రామాల్లో 500 మెట్రిక్ టన్నులు ఒక్కోటి రూ. 40లక్షల వ్యయంతో గోదాం నిర్మాణ పనులు తుదిదశకు చేరాయన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో నూతనంగా విదేశ విద్యకు విద్యార్థులకు రూ. 40లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. ఆయనతో పాటు సీఈఓ జాలాది నాగ ప్రసాదు, సొసైటీ సిబ్బంది ఎస్.సతీష్, రామాంజనేయులు ఉన్నారు.

అన్నదానం

విజయపురిసౌత్: మాచర్ల మండల పరిషత్ అధ్యక్షురాలు బూడిద మంగమ్మ తనయుడు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విజయపురిసౌత్‌లో వెయ్యి మందికిపైగా మాలాధారులకు అన్నదానం నిర్వహించారు. సోమవారం కార్తీకమాసాన్ని పురస్కరించుకొని విజయపురిసౌత్ లాంచీ స్టేషన్ సమీపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపీపీ తనయుడు బూడిద శ్రీనివాసరావు, జిల్లా గొర్రెల పెంపకం దార్ల అధ్యక్షుడు బూడిద సైదులు భారీ స్థాయిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకుముందు అయ్యప్పస్వామి, శ్రీకృష్ణ దేవాలయాలలో ప్రత్యేక పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు.

ఆదర్శప్రాయుడు మాజీ సీఎం రోశయ్య

నివాళులర్పించిన ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: దేశానికి, రాష్ట్రానికి నిస్వార్థ సేవలు అందించిన ఆదర్శప్రాయుడు మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి కొనియాడారు. ఆయన రెండో వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం శివుడి బొమ్మ సెంటర్‌లోని కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ దివంగత రోశయ్యకు ఆర్థిక సంబంధ విషయాలు, రాజకీయాలపై మంచి పట్టు ఉందన్నారు. రాష్ట్రానికి 15సార్లు బడ్జెట్ సమర్పించారన్నారు. ఆర్థికశాఖ మంత్రిగా, ముఖ్యమంత్రిగా మరెన్నో కీలక పదవుల్లో నిస్వార్థ సేవలు అందించిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన అడుగుజాడల్లో నడిచి వైశ్యులంతా జాతికి వన్నె తీసుకురావాలని పిలుపునిచ్చారు. పల్నాడు డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, ఎంపీపీ మోరబోయిన శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తన్నీరు శ్రీనివాసరావు, విద్యావేత్త వద్దుల సుబ్బారెడ్డి, ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.


రోశయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, నాయకులు

రేపు అబ్దుల్లా బాషా బాబా ఉరుసు

చిలకలూరిపేట: మండలంలోని పోతవరం గ్రామంలో ఉన్న హజరత్ మౌలానా మౌల్వి మొహమ్మద్ అబ్దుల్లాబాషా బాబా 72వ ఉరుసు మహోత్సవం బుధవారం నిర్వహిస్తున్నట్లు దర్గా నిర్వాహకులు తెలిపారు. మౌలానా మౌల్వి మొహమ్మద్ అబ్దుల్లా బాషా తమిళనాడు రాష్ట్రంలోని రాయవేలూరులో జన్మించారు. ఆయన బాకియాతుష్ సలాక్ అనే కళాశాల నుంచి ధార్మిక విద్యలో మౌల్వి పట్టాను పొందారు. మారిఫత్ నయీ గజల్ అనే పుస్తకం రాయడం ద్వారా ఉర్దూ కవుల నుంచి ఖాదరిష్య జలియా అనే బిరుదు పొందారు. 40 ఏళ్ల వయసులో జాతీయ నాయకుల ఉపన్యాసాలకు ప్రభావితమై స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు. సత్యాగ్రహంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు. అనంతర కాలంలో పోతవరం గ్రామానికి చేరుకొని గ్రామస్తులకు ఆధ్యాత్మిక భావం, పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించేవారు. గ్రామంలో మసీదు నిర్మించి నమాజ్ చేయించేవారు. వనమూలికలతో కులమతాలకు అతీతంగా ఉచితంగా వైద్యం అందించేవారు. అబ్దుల్లాబాష బాబా ఆయన శిష్యులకు తాను 1953వ సంవత్సరం రబ్బీలవల్ మాసంలో శనివారం తుది శ్వాస విడుస్తానని చెప్పారు. సరిగా అదే సమయంలో ఆయన తుది శ్వాస విడిచారు. అప్పటి నుంచి ప్రతి ఏటా ఉర్దూ మాసం రబ్బీలవల్‌లో ఆయన ఉరుసుమహోత్సవం నిర్వహిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా ఆరో తేదీ ఉరుసు, ఏడున దీపారాధన, అన్నదానం నిర్వహించనున్నారు.


పోతవరంలోని హజరత్ మౌలానా మౌల్వి మొహమ్మద్ అబ్దుల్లా బాషా బాబా దర్గా

బీజేపీ వైఫల్యాలను ఎండగట్టడమే సీపీఎం లక్ష్యం

జిల్లా కమిటీ సమావేశంలో రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య

నరసరావుపేట: దేశంలో పెరుగుతున్న మతోన్మాదాన్ని కూకటి వేళ్లతో పెకలించాలంటే బీజేపీని ఓడించడం ద్వారానే సాధ్యమని, మోదీని ఓడించండి అనే నినాదంతో తమ పార్టీ నిత్యం ప్రజల్లో ఉంటుందని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య అన్నారు. సోమవారం కోటప్పకొండరోడ్డులోని పల్నాడు జిల్లా కేంద్రంలో పార్టీ పల్నాడు జిల్లా కమిటీ సమావేశం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు అనుముల లక్ష్మీశ్వరరెడ్డి అధ్యక్షత నిర్వహించారు. కృష్ణయ్య మాట్లాడుతూ ఇటీవల నాలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో మూడు రాష్ట్రాలలో బీజేపీ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం చూస్తే మతోన్మాద ప్రమాదం ఏ స్థాయిలో ఉందో తేటతెల్లమైందన్నారు. ఆ పార్టీ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి దాని వలన దేశానికి, కార్మికులు, కర్షకులు, ఉద్యోగులకు కలిగే నష్టాలను వివరిస్తూ ఆ పార్టీ విధానాలను ఎండగట్టడమే పనిగా పెట్టుకొని తమ పార్టీ నిత్యం ప్రజల్లో ఉంటుందన్నారు. నిత్యం ప్రజలను చైతన్యం చేస్తున్న తమ పార్టీకి ప్రజలు మద్దతు ఇవ్వాలని కోరారు. జిల్లా కార్యదర్శి గుంటూరు విజయకుమార్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు, జి.రవిబాబు, వై.రాధాకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు డి.శివకుమారి, జి.మల్లీశ్వరి పాల్గొన్నారు.


సమావేశంలో కృష్ణయ్య, నాయకులు

విద్యార్థినులకు ట్యాబ్‌లు అందజేత

శావల్యాపురం: ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా స్థానిక భవిత సెంటరులో విభిన్నా ప్రతిభావంతులైన విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంఈఓ మద్దికుంట సాంబశివరావు పాల్గొని మాట్లాడుతూ సమాజంలో దివ్యాంగులను చిన్న చూపు చూడకూడదని, వారిలో ఉన్న ప్రతిభను వెలికితీసి గొప్పవారిని చేయాలన్నారు. ఈ ఏడాది పదో తరగతి చదువుతున్న ప్రత్యేక అవసరాలు కలిగిన ఇద్దరు విద్యార్థినులకు సమగ్ర శిక్ష అభియాన్ సారధ్యంలో ఒక్కోటి రూ. 28 వేల విలువ చేసే ట్యాబ్‌లు అందజేసినట్లు చెప్పారు. భవిత సెంటరులో చేరిన ప్రత్యేక అవసరాలు కల్గిన విద్యార్థులకు వినికిడి పరికాలు, వీల్‌ఛైర్లు తదితరవన్నీ ప్రభుత్వమే ఉచితంగా మంజూరు చేస్తుందన్నారు. అనంతరం ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో ఎంఈఓ పుసులూరి లలితాకుమారి, భవిత సెంటరు ఉపాధ్యాయులు కె.జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.



క్లుప్తంగా

99శాతం పింఛన్ల పంపిణీ



నాదెండ్ల: మండలంలోని 16 సచివాలయాల పరిధిలో ఆదివారం నాలుగో రోజు వైఎస్సార్ పెన్షన్ కానుక – సామాజిక భద్రతా పెన్షన్ల పంపిణీ 99 శాతం పూర్తయింది. వలంటీర్లు ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ నగదు అందించారు. మండల పరిధిలో 9661 మంది లబ్ధిదారులకు గాను రూ.2,66,46,750లు పంపిణీ చేయాల్సి ఉంది. ఎంపీడీఓ షేక్ జాకీర్‌హుస్సేన్, ఆయా సచివాలయాల వెల్ఫేర్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పర్యవేక్షించారు.

విద్యుత్ పరికరాలతో జాగ్రత్త అవసరం


చిలకలూరిపేట: విద్యుత్ వినియోగదారులు తుఫాన్ వలన వర్షాలు, గాలులు వీస్తున్న నేపధ్యంలో విద్యుత్ పరికరాల పట్ల జాగ్రత్తలు పాటించాలని విద్యుత్ ఏడీఈ ఆర్.అశోక్ కుమార్ తెలిపారు. ముఖ్యంగా వర్షాల నేపధ్యంలో పొలాల్లో నీటి మునిగి ఉన్న మోటార్లు, స్టార్టర్స్ డబ్బాలు తడిసి ఉంటాయని, వాటిని ముట్టుకొనే ప్రయత్నం చేయరాదని సూచించారు. విద్యుత్ స్తంభాలు పడిపోయి వైర్లు తెగిపోయినప్పుడు వాటి సమీపానికి వెళ్లరాదని తెలిపారు. ఇళ్లకు సంబంధించిన సర్వీసువైర్లు, వాటితో వేలాడే ఇనుపతీగలు, విద్యుత్ స్తంభాలను ముట్టుకోవద్దన్నారు. తడి చేతులతో ఇళ్లలోని స్విచ్ బోర్డులను ముట్టుకోరాదన్నారు. విద్యుత్ షాక్‌తో ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త పడాలన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవారం పూజలు



శావల్యాపురం: మండలంలోని గంటావారిపాలెం, కారుమంచి, మతుకుమల్లి, వేల్పూరు, శావల్యాపురం, పోట్లూరు తదితర గ్రామాల్లో వేంచేసియున్న శివాలయాల్లో కార్తిక మూడో సోమవారం సందర్భంగా భక్తులు పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున పుణ్యస్నానాలు ఆచరించి, స్వామి వారిని దర్శించుకొని మట్టి ప్రమిదల్లో, ఆవు నెయ్యి పోసి దీపాలు వెలిగించారు. శావల్యాపురంలో వేంచేసియున్న రామలింగేశ్వరస్వామి దేవాలయంలో తెల్లవారుజాము నుంచి శివుడికి అభిషేకాలు, రుద్రాభిషేకం తదితర విశేష పూజలు ఆలయ పూజారి సాయి భరత్ ఘనంగా నిర్వహించారు. కార్తికమాసం సందర్భంగా నియమనిష్టలతో భక్తులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉపవాసాలు ఉన్నారు. మాలధారణలో ఉన్న అయ్యప్పలు, భవానీలు శివాలయాల్లో శివుడు సన్నిధిలో ప్రత్యేక పూజలు చేపట్టారు. మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో వేంచేసియున్న అడవి పేరంటాళ్లమ్మ అమ్మవారి దేవాలయంలో మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జిల్లా స్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



సత్తెనపల్లి: నరసరావుపేట డీఎస్సీ స్టేడియంలోని ఇండోర్‌హాల్‌లో ఈ నెల 3న ఆర్.బి.డ్రాగన్స్ షాటోకాన్ కరాటే డు–ఇండియా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన పల్నాడు జిల్లా స్థాయి కరాటే బెల్ట్ టెస్ట్ పోటీల్లో సత్తెనపల్లి విద్యార్థులు ప్రతిభ కనబరిచి గోల్డ్ మెడల్ సాధించారు. ఈ పోటీలకు జిల్లాలోని నలుమూలల నుంచి 256 మంది బాలబాలికలు హాజరయ్యారు. సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో సాయిరాం, రవికుమార్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు మంచి ప్రతిభతో బాలికల విభాగంలో యస్.లిఖిత గోల్డ్ మెడల్ సాధించగా, టి.శివశ్రీ, ఎ.మాధురి సిల్వర్ మెడల్ సాధించారు. బాలుర విభాగంలో టి.జీవన్, జి.మహేష్, ఎం.సాయి, జి.సాత్విక్, ఎస్.షణ్ముక్ గోల్డ్ మెడల్ సాధించగా, ఎం.శ్రీహర్ష, ఎం.సాయి ప్రణవ్ సిల్వర్ మెడల్ సాధించారు. గెలుపొందిన విద్యార్థులకు కరాటే బెల్టులు, సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. ప్రతిభ చూపిన విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన కోచ్‌లను సోమవారం పట్టణంలో పలువురు అభినందించారు.

కుటుంబ నియంత్రణపై అవగాహన

ముప్పాళ్ళ: వేసక్టమీ ఆపరేషన్ పక్షోత్సవాలలో భాగంగా మండల కేంద్రమైన ముప్పాళ్ళలో పురుషులకు కుటుంబ నియంత్రణ పద్ధతిపై వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న కమ్యూనిటీ హెల్త్ సూపర్‌వైజరు సీ ఆంజనేయులు మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ పాటించటంలో మహిళలతో పాటుగా పురుషులు భాగస్వాములు కావచ్చన్నారు. ఈ విధానంపై అవగాహన కల్పించారు. హెల్త్ ఎడ్యుకేటర్ అనంతలక్ష్మి, హెల్త్ సూపర్‌వైజరు ఏ పీటర్‌డానియేల్, ఏఎన్ఎం జి.జ్యోతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.